క్లుప్తంగా

బాడీబిల్డింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



50 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన శేఖర్



55 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన రఫి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్, ఫిట్‌నెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనపరచి బంగారు పతకం సాధించారు. కాకినాడ ఎస్‌ఆర్‌ఎంటీ మాల్ ఎదురుగా ఉన్న బి.ఫిట్‌జిమ్‌లో జిమ్ నిర్వాహకులు భాష వద్ద శిక్షణ పొందుతున్న రఫి 55 కేజీల విభాగం బంగారు పతకం, శేఖర్ 50 కేజీల విభాగంలో బంగారు పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా కోచ్ భాష మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు.

డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో నాగవల్లి హాస్టల్‌లో పునఃప్రారంభించిన డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. కోవిడ్ కారణంగా తాత్కాలికంగా మూతపడిన డే కేర్ సెంటర్ సేవలు శుక్రవారం తిరిగి ప్రారంభించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్ర, మాజీవీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఛీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు, ఏఈలు ఫ్రాన్సిస్, నవీన్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ అటెండర్ మృతి

కాకినాడ క్రైం: స్థానిక కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న నరాల ప్రకాష్‌రావు(62) బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శారదాదేవి దేవాలయం జంక్షన్ వెనుక నివాసం ఉండే ప్రకాష్‌రావు గత నెల 30వ తేదీన ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందుతాగి ఇంట్లో ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై కాకినాడ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ కార్పొరేటర్ ముళ్లపూడి రాంబాబు మృతి

కాకినాడ: రాష్ట్ర మున్సిపల్ కౌన్సిలర్స్ చాంబర్ మాజీ వైస్ చైర్మన్, కాకినాడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ముళ్లపూడి రాంబాబు(69) గురువారం ఆయన నివాసంలో మృతి చెందారు. కౌన్సిలర్‌గా, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడిగా ఆయన విశిష్ట సేవలు అందించారు. రాంబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముళ్ళపూడిరాంబాబు మృతికి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తీవ్ర సంతాపం తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం అంకిత భావంతో ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మరణం తీరనిలోటన్నారు. కాకినాడకు చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు ముళ్లపూడి రాంబాబు మృతదేహాన్ని సందర్శించి, ఆయన కుటుంబ సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పెదలంక ఇసుక ర్యాంపును తెరవాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఇసుక ర్యాంపును తెరిచి తమకు ఉపాధి కల్పించాలని వెంకటేశ్వర బోట్స్‌మెన్ అసోసియేషన్ వర్కర్లు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మేడిశెట్టి చంటి, ఎం.రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. కాజులూరు మండలం పెదలంకలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారన్నారు. సుమారు ఏడాది క్రితం నుంచి పేరుకుపోయిన పెదలంక రేవులో ఇసుక మేటలను తొలగించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. మాన్యువల్ పరిధిలో ఇసుకను తొలగించి బోట్ల ద్వారా ఒడ్డుకు తరలించాలని అధికారులు నిర్ణయిచారన్నారు. అందువల్ల తొలగించిన ఇసుకను ప్రభుత్వ భూముల్లో నిబంధనల ప్రకారం అధికారుల పర్యవేక్షణలో ఉంచుతామన్నారు. ఇసుకను తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. బోట్స్‌మెన్ అసోసియేషన్ నాయకులు అమరవిల్లి శ్రీను, గుత్తుల శ్రీను, మోర్త ప్రకాశం, వీరబ్రహ్మాజీ, మేడిశెట్టి హరీష్, జి గిరీష్, శంకర్, వెంటపల్లి భాస్కరరావు, సిరిపూరి వర్మ, వెంటపల్లి శ్రీను, వీరా సత్తిపండు, వాసంశెట్టి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మాసానికి సర్వం సిద్ధం

- శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- తెల్లవారుజాము నుంచి తెరచుకోనున్న ఆలయాలు
- భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు



కార్తిక మాసోత్సవాలకు సిద్ధమైన కాకినాడ భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయం



కార్తిక మాస ఉత్సవాలకు సిద్ధమైన కాకినాడ దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి దేవస్థానం

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో శివాలయాలు కార్తిక మాస పూజలకు సిద్ధమయ్యాయి. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాలు, ఆయా పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక క్యూలైన్లు, ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. శైవ క్షేత్రాల్లో భక్తులు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే దేవదాయశాఖ నుంచి ఆయా ఆలయాల ఈఓలకు ఆదేశాల సైతం అందాయి. సాధారణ రోజుల్లో ఆలయాలు ఉదయం 5 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. కార్తిక మాసం నేపథ్యంలో తెల్లవారు జామున 3 గంటలకే శైవక్షేత్రాలు తెరవాలని దేవదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయానికి అభిషేకం కోసం వచ్చే భక్తులకు, దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈఓ వీర్రాజు తెలిపారు. స్థానిక దేవాలయంవీధిలోని అతిపురాతన బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. తెల్లవారుజాము నుంచి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్థానిక రామారావుపేట అన్నపూర్ణాసమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం, జగన్నాథపురం శివాలయంలో భారి క్యాడ్లు, భక్తులు మంచినీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇబ్బందుల్లేకుండా చర్యలు



కార్తికమాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే శైవక్షేత్రాలకు చెందిన ఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఆలయానికి వచ్చే భక్తులుకు తాగునీరు, ప్రసాదం పంపిణీకి చర్యలు తీసుకొన్నాం. తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేస్తున్నాం. పారిశుధ్యం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకొంటున్నాం.

– వడ్డి ఫణికుమార్, దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్

పింఛన్.. టెన్షన్

- మొరాయించిన సర్వర్లు
- వృద్ధుల పడిగాపులు



కరపలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అనుపమ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు



పండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పింఛన్ల కోసం లబ్ధిదారుల నిరీక్షణ

కాకినాడ రూరల్: సామాజిక పింఛన్ సొమ్ముల పంపిణీలో వృద్ధులు టెన్షన్‌కు గురయ్యారు. సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో మొత్తం 18212 మంది లబ్ధిదారులకు సుమారు రూ.7కోట్ల వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ములు నవంబరు ఒకటో తేదీన శుక్రవారం అందించాల్సి ఉంది. ఉదయం 8.30 గంటల వరకు పని చేసిన సర్వర్ తరువాత పనిచేయలేదు. సామాజిక పింఛన్ సొమ్ములు కోసం నిరీక్షించిన వృద్ధులు, వితంతువులు, కిడ్నీ బాధితులు రోగులు తదితరులు ఎప్పటిలాగే తమకు పింఛన్ అందుతుందని ఎదురు చూశారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ములు ఇవ్వకపోవడంతో పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలకు తరలివచ్చారు. పండూరు పంచాయతీ వద్ద వృద్ధులు గంటల తరబడి నిరీక్షించి, ఓపిక లేక ఇండ్లకు వెళ్లిపోయారు. వాకలపూడి, వలసపాకలతో అన్ని గ్రామాలలో సర్వర్ సమస్య ఏర్పడింది. మధ్యాహ్నం 3.30గంటల నుంచి సర్వర్ పనిచేయడంతో సాయంత్రానికి 89మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములు అందించారు. మొత్తం 18212మందికి 16168మందికి పింఛన్లు అందించామని, సర్వర్ సమస్య వల్ల జాప్యం జరిగిందని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. మిగిలిన 1950 అందిస్తున్నామన్నారు.

కరప మండలంలో 87.18 శాతం పంపిణీ

కరప: మండల పరిధిలో శుక్రవారం సాయంత్రానికి 87.18 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛనుదారులు 11,416 మంది ఉండగా రూ.4,77,61,500 లు ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 9,952 మంది లబ్ధిదారులకు రూ.4,15,91,500 లు గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛను ఇచ్చారన్నారు. వేళంగి–1 గ్రామ సచివాలయం 96.23 శాతం, కొంగోడు సచివాలయం 96.07 శాతం, యండమూరు సచివాలయం 95.96 శాతంతో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్లు అందజేశారన్నారు. ఆలస్యమైనా మొదటిరోజు 98 శాతం పూర్తిచేయమని చెప్పామన్నారు. ఉదయం 8.15 గంటల వరకు సర్వర్ పని చేసిందని, తర్వాత పనిచేయలేదన్నారు. మిగిలిన లబ్ధిదారులకు శనివారం అందజేస్తామని ఎంపీడీఓ అనుపమ వివరించారు. పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు అధికారులతో కలిసి పింఛన్లు పంపిణీలో పాల్గొని, ఫొటోలు తీయించుకుని, హడావుడి చేశారు. ఒక గంట తర్వాత ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

కరప: నడకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎంఈఓ పి.సత్యనారాయణ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా యంగ్‌మైండ్స్ స్వచ్ఛం దసేవా సంస్థ వ్యవస్థాపకుడు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ పాఠశాలలోని 280 మంది విద్యార్థులకు యంగ్‌మైండ్స్ తరపున పెన్నులను అందజేశారు. హైస్కూలు హెచ్‌ఎం మురళి, యంగ్‌మైండ్స్ సభ్యులు మంగారావు, లక్ష్మి, అరుణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దంతాలను రెండు పూటలా శుభ్రం చేసుకోవాలి



బ్రష్‌లు పంపిణీ చేస్తున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: ప్రతి రోజు రెండుపూటలా దంతాలు శుభ్రం చేసుకోవడం ద్వారా అనేక దంత సమస్యలు నుంచి దూరంగా ఉండవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద సత్య దంత వైద్యశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ బ్రష్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించి టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. చిన్న నాటి నుంచి పిల్లలకు రెండు పూటలా బ్రష్ చేసుకోవడం తల్లిదండ్రులు అలవాటు చేయాలన్నారు. అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, చైతన్య, సిరాజ్, అనిల్, భవాని, సోని పాల్గొన్నారు.

చీకట్లు తొలిగే .. దివ్వెలు వెలిగే..



దివిటీలు వెలిగిస్తున్న చిన్నారులు



దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఖుషి అగర్వాల్



బాణసంచా కాల్చుతున్న యువతి

కాకినాడ రూరల్: దీపావళి పండగను కాకినాడ రూరల్ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చెడుపై విజయానికి చిహ్నంగా జరుపుకొనే దీపావళిని ప్రజలు చీకట్లు తొలగి జీవితాలలో కాంతులు నిండేలా పండగ జరుపుకొన్నారు. రమణయ్యపేట మార్కెట్, సర్పవరం జంక్షన్ పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి పూజా సామగ్రి, ప్రమిదలు విక్రయాలు జోరుగా సాగాయి. దీపావళిలో చిన్నారులు నుంచి పెద్దలు చేసే బాణసంచా కోసం దుకాణాలు వద్ద క్యూ కట్టారు. బోట్‌క్లబ్‌తో పాటు పలు చోట్ల ఏర్పాటు చేసిన బాణసంచా సామగ్రి విక్రయాలు వద్ద పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. సాయంత్రం లక్ష్మీదేవి పూజ అనంతరం బాణసంచా కాల్చుతూ సందడి చేశారు.

అనాథలకు దీపావళి సామగ్రి పంపిణీ

బోట్‌క్లబ్: దీపావళి సందర్భంగా నగరంలోని పలు అనాథ ఆశ్రమాలకు గురువారం ప్రముఖ వ్యాపారవేత్త వినోద్ అగర్వాల్ కుమార్తె ఖుషి అగర్వాల్ స్వీట్లు, దీపావళి సామాన్లు పంపిణీ చేశారు. చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకొన్నారు. స్థానిక బులుసు సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాల, స్థానిక భానుగుడి వద్ద నున్న ప్రభుత్వ అందుల పాఠశాల, బదిరుల పాఠశాల, పరివర్తన వీధి బాలల సంరక్షణ కేంద్రం, ఉమామనోవికాస కేంద్రంతోపాటు పలు పాఠశాలలో ఉన్న చిన్నారులకు స్వీట్లు, దీపావళి సామాన్లు అందించారు. కాకినాడ జర్నలిస్ట్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా శివరామకృష్ణ, సరళ ఫుడ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరప మండలంలో..

కరప: మండలంలో దీపావళి పండగను చిన్నారులు, పెద్దలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే బాణసంచా సామగ్రి కొనుగోలు చేశారు. సాయంత్రం మహిళలు తలస్నాన మాచరించి, లక్ష్మీదేవికి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. అనంతరం చిన్నారులు, పెద్దలు గోగుకర్రలకు నూనెలో నానపెట్టిన వత్తెలు కట్టి వెలిగించి, దివిటీలు వెలిగించారు. పెద్దలు, చిన్నారులు దీపావళి పండుగను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.

భావ కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణశాస్త్రి



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రచయితల సంఘం

కాకినాడ రూరల్: భావ కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణ శాస్త్రి అని, ఆయన సాహిత్యానికి చేసిన మరవలేవమని సాహితీ ప్రియుడు డాక్టరు జవహార్ పేర్కొన్నారు. దేవులపల్లి కృష్ణ శాస్త్రి జయంతిని రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద శుక్రవారం నిర్వహించారు. దేవులపల్లి విగ్రహానికి డాక్టరు జవహార్, సాహిత్యవేత్త డాక్టరు వేదుల శిరీష, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బరాజు, విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు, కవి గౌరీనాయుడు, అడబాల రత్నప్రసాద్, అద్దేపల్లి ఉదయ్‌భాస్కర్, కొమ్మూరి శ్రీనివాసరావు, దాసరి శ్రీధర్, వెన్నపు ప్రసాద్ పాల్, విజయలక్ష్మి, మంగతాయారు, ప్రసాద్ నాయుడు, రవి తదితరులు పాల్గొని నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేవులపల్లి 1897 నంబర్ ఒకటిన సామర్లకోట మండలం చంద్రంపాలెంలో జన్మించారన్నారు. ఆకాశవాణిలో గేయాలు, బాల గేయాలు, కార్మిక గీతాలు, భక్తి గీతాలను అనేక సంఖ్యలో రచించి వినిపించారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ బిరుదులు అందించిందన్నారు. తెలుగుభాషపై ఆయన గౌరవం పెంపొందించారన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 18 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 22 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్–1,2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా, 18 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 22 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

‘చదరంగం’ విజేత షరీఫ్‌కు అభినందనలు



డీఈఓ రమేష్‌తో షరీఫ్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తెనాలిలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 చదరంగ పోటీలలో టీం ఈవెంట్‌లో కాకినాడకు చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్ షరీఫ్ విజేతగా నిలిచి, బంగారు పతకం సాధించడం జిల్లాకు గర్వకారణం అని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌ను ఆయన కార్యాలయంలో షేక్‌అబ్దుల్ ఖాదర్, పాఠశాల ప్రిన్సిపాల్ షరిమ్లతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రస్థాయిలో బాలుర టీం ఈవెంట్‌లో తూర్పుగోదావరి జట్టు బంగారు పతకం సాధించినట్లు డీఈఓకు వివరించారు. రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన ఖాదర్‌ను డీఈఓ అభినందించారు. పాఠశాల క్రీడాసమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి, అకడమిక్ డీన్ రమణారావు, బషీర్, పీడీ సతీష్‌లు ఖాదర్‌ను అభినందించారు.

రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు



రాష్ట్రస్థాయి సీనియర్స్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అనంతపురం జిల్లా కళ్యాణ గుర్గంలో ఈనెల 9, 10 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికను జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డీఎస్ఏలో నిర్వహించారు. ఈ ఎంపికలను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 30 మంది ఎంపికలకు హాజరుకాగా 17 మంది రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. రెజ్లింగ్ కోచ్ కనకదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ఫ్రీస్టైల్ వుమెన్ 50, 53, 57, 59, 65, 72, 76 కేజీల విభాగం, బాలుర ఫ్రీ స్టైల్ 65, 70,74, 79 కేజీల విభాగంలోను, గ్రీకు, రోమన్‌లో బాలురు, బాలికల విభాగంలో 63, 67, 72, 77, 82 కేజీల అంశాల్లో క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు. ఈ ఎంపికల నిర్వహణలో రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు ఎలీషాబాబు, కార్యదర్శి రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దీపం-2తో మహిళల జీవితాల్లో వెలుగులు

జిల్లా కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్న దీపం–2 పథకంతో మహిళల జీవితాల్లో వెలుగులు వస్తాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సూపర్ 6లో భాగంగా సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి దీపం–2 కార్యక్రమం జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ సూర్య కళామందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ ఎమ్మెల్యేలు పంతం వెంకటేశ్వరరావు, వనమాడి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రాష్ట్ర పౌరసరఫాల సంస్థ డైరెక్టర్లు తుమ్మల పద్మజ లక్ష్మి, కడలి ఈశ్వరీ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దీపావళి కానుకగా ప్రభుత్వం అందిస్తున్న దీపం –2 పథకం మహిళా లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకంలో బియ్యం కార్డు, గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరిని లబ్ధిదారునిగా గుర్తిస్తుందన్నారు. జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ దీపం–2 పథకం కింద జిల్లాలో 6.92 గ్యాస్ కనెక్షన్లకు గాను ఇప్పటి వరకు 5,11,756 మంది అర్హులను గుర్తించామన్నారు. నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఇస్తారన్నారు. మొదటి సిలిండర్ కోసం మార్చి 31, 2025 లోపు బుక్ చేసుకోవాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారి ఎంవీప్రసాద్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లిబాబు, కె.శ్రీరమణి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: కాకినాడ సూర్యకళామందిర్‌లో ఎన్టీయార్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాలు లబ్ధిదారులకు అందజేశారు. కాకినాడ పట్టణానికి చెందిన 10 మంది వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.